ఎస్ఎస్ఎస్‌వీలో విజ్ఞానం

విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకిస్తున్న పాఠశాల చైర్మన్ శిరీష భవానీశంకర్

యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో ప్రదర్శన

జూబ్లీహిల్స్,జనవరి6: యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీ సాయి సరస్వతి విద్యానికేతన్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో ట్రాఫిక్ సిగ్నల్స్, విత్తనాల అంకురోత్పత్తి, సౌర కుటుంబం, కోడి జీవిత చక్రం, నీటి చక్రం, ఇంద్రియ అవయవాలు, సమాజానికి సేవ చేస్తున్న రైతులు.. వైద్యుల గురించి ప్రయోగాల రూపంలో వివరించి ఆకట్టుకున్నారు.

పాఠశాల చైర్మన్ శిరీషా భవాని శంకర్ విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనాలను తిలకించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉషా మీనాక్షి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 3లో ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫుట్‌పాత్ వ్యాపారుల జీవనోపాధి దెబ్బతీయొద్దు

• ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్,జనవరి 6: ఫుట్‌పాత్ వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీసేలా ట్రాఫిక్ పోలీసులు వ్యవహరించవద్దని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. బంజారాహిల్స్ రోడ్ నం 3లోని గ్రీన్ మాస్క్ సమీపంలో రోడ్డుపక్కన హోటల్స్, టీస్టాల్స్ లాంటి చిన్న వ్యాపారాలు చేసుకుని పొట్టపోసుకునేవారిని ట్రాఫిక్ పోలీసులు వేధిస్తున్నారంటూ పలువురు చిరువ్యాపారులు శనివారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వారితో పాటు గ్రీన్ మాస్క్‌వద్దకు వచ్చిన ఎమ్మెల్యేదానం ట్రాఫిక్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేస్తున్న వారిని కూడా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని కోరారు. రోడ్డుపై రాకపోకలకు అడ్డంకులు లేకుండా వ్యాపారాలు చేసుకుంటే ట్రాఫిక్ పోలీసులకు అభ్యంతరం ఉండదని అధికారులు చెప్పారు. ఈ మేరకు చిరువ్యాపారులంతా క్రమపద్ధతిలో వ్యాపారం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

జూబ్లీహిల్స్ పీఎస్‌లో డీసీపీ ఆకస్మిక తనిఖీ

బంజారాహిల్స్, జనవరి 6: వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ శనివారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్నం పీఎస్‌కు వచ్చిన డీసీపీ పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమైన కేసుల దర్యాప్తు తీరుతో పాటు సిబ్బంది పనితీరును పరిశీలించారు. పీఎస్ పరిధిలో పనిచేస్తున్న ఎస్ఐలు, ఇతర సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏపీకి చెందిన ఓ ఉన్నతాధికారి కొడుకు దౌర్జన్యంపై పీఎస్‌లో నమోదైన కేసుకు సంబంధించిన వివరాలు కూడా తెలుసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గత సెప్టెంబర్‌లో జూబ్లీహిల్స్‌లోని ఓపబ్‌లో రెండు గ్రూపుల మధ్య జరిగిన గొడవలకు సంబంధించిన ఏపీకి చెందిన ఉన్నతాధికారి కొడుకుతో పాటు ఇతర యువకులపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసులో దర్యాప్తు ముందుకు సాగకపోవడానికి గల కారణాలతో పాటు కేసులో సదరు అధికారి కొడుకుకు సంబంధించిన పాత్రపై కూడా డీసీపీ ఆరా తీసినట్లు తెలుస్తోంది.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

ఎర్రగడ్డ, జనవరి 6: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎర్రగడ్డలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ శనివారం పంపిణీ చేశారు. సుల్తాన్‌నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 14 మంది మహిళలు చెక్కులను అందుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు డి.సంజీవ, మల్లేశ్, మహ్మద్‌అజర్, అజీమ్, అప్సర్, యాదగిరి, దాసి శ్రీకాంత్, బాలకృష్ణ, తరుణ్, బాలు, ఎండీ సర్దార్, బాబూజానీ, ఇంతియాజ్‌అలీ, రూపేష్, బాలు పాల్గొన్నారు.

జేహెచ్‌పీఎస్‌లో ఆకట్టుకున్న ప్రతిభాదర్శన్

బంజారాహిల్స్,జనవరి 6: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ప్రతిభాదర్శన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎల్‌కేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో 'ఖుద్‌రత్ కా కరిష్మా ' పేరుతో నృత్యరూపకం ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గురించి వివరిస్తూ చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నతననుంచే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ప్రిన్స్‌పాల్ కాంచనవల్లి పేర్కొన్నారు.

జెండా ఊపి కారు ర్యాలీని ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్‌కు ప్రజల నుంచి ఆదరణ

బండ్లగూడ,జనవరి 6: పేదలకు సహాయం చేసేందుకు కృషి చేస్తున్న రోటరీ క్లబ్‌కు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని రోటరీ క్లబ్ హైదరాబాద్ డెక్కన్ అధ్యక్షుడు అనిల్ రాంచందాని పేర్కొన్నారు.శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సోలీటైర్ గ్లోబల్ పాఠశాల యజమాన్యం ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ వారు కారు ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా రాంచందానీ మాట్లాడుతూ కారు రేస్‌లో 20కి పైగా కార్లు రేసింగ్‌లో పాల్గొన్నాయని తెలిపారు.వీరు సాయంత్రం వరకు 45కిలో మీటర్ల స్పీడ్‌తో హంపీ చేరుకోవాలని సమయాన్ని నిర్ధారించినట్లు పేర్కొన్నారు. ఈ రేస్ ద్వారా వచ్చిన డబ్బులను హైదరాబాద్ కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌కు అందజేసి వారి ద్వారా నిరుపేదల వైద్య ఖర్చులకు ఉపయోగిస్తామని తెలిపారు.

అధికారి శివకుమార్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం

ఎర్రగడ్డ, జనవరి 6: రాజీవ్‌నగర్ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశాన్ని శనివారం కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. పంజాగుట్ట రీజియన్ సహాయ పెన్షన్ చెల్లింపు అధికారి శివకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. రాజీవ్‌నగర్ కాలనీలోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులంతా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడం అభినందనీయమని శివకుమార్ అన్నారు. ముఖ్యంగా ప్రతిభాన్విత పేద విద్యార్థుల చదువులకు నగదు ప్రోత్సాహకాలను అందజేయటం గొప్ప విషయమని పేర్కొన్నారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు శివకుమార్‌ను సన్మానించి నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను బహూకరించారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణశర్మ, ఉపాధ్యక్షుడు భుజంగరావు, కార్యదర్శి సత్యానందం, కోశాధికారి బద్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతలు

శంషాబాద్ రూరల్, జనవరి 6: ఇంటింటికీ శ్రీరాములోరి అక్షింతలు అందిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు బుక్క వేణుగోపాల్ తెలిపారు. శనివారం శంషాబాద్ మండలంలోని నర్కూడ, చౌదర్‌గూడ, సుల్తాన్‌పల్లి, కేబీదొడ్డి గ్రామాల్లో అయోధ్య శ్రీసీతారామచంద్ర స్వామి అక్షింతలను వితరణ చేశారు.కార్యక్రమంలో నర్కూడ గ్రామ సర్పంచ్ సిద్దులు, రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమార్‌యాదవ్, వార్డు సభ్యులు వినోద్, పార్టీ నాయకులు నగేశ్‌గౌడ్, కుమార్, మల్లేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్‌గౌడ్, భాస్కర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. దీంతో పాటు సుల్తాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన అక్షింతలు పంపిణీలో నాయకులు శ్రీకాంత్‌గౌడ్, నర్సింగ్ ముదిరాజ్, మల్లికార్జున్, చంద్రశేఖర్, సాయి, మహేందర్,తదితర నాయకులు పాల్గొన్నారు.

మార్కండేయనగర్‌లో..

మైలార్‌దేవ్‌పల్లి : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మార్కండేయనగర్ కాలనీలో శ్రీరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం నుంచి ఇంటింటికీ తిరుగుతూ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు గద్దె కృష్ణ, ప్రధాన కార్యదర్శి పి.సూర్యనారాయణ, వీడం రమేశ్, కోట శ్యామ్, నరేందర్, చందు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నర్కూడ గ్రామంలో రాములోరి అక్షింతలను పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు బుక్క వేణుగోపాల్, తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోఅక్షింతలను పంపిణీ చేస్తున్న వీరాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు

బంజారాహిల్స్ పరిధిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

ఖైరతాబాద్ నియోజకవర్గంలో..

బంజారాహిల్స్ :అయోధ్య శ్రీరాముడి అక్షితలను ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్లలో శనివారం హిందూసంఘాలు, స్థానిక నేతలు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్ కాలనీలో బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

• ఖైరతాబాద్ ఓటర్లు 2.97 లక్షలు

ఎన్నికల అధికారులతో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి

ఖైరతాబాద్, జనవరి 6: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ముసాయిదా ఓటరు జాబితా సిద్ధమైంది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో కొత్త వారితో కలిపి మొత్తం 2,97,666 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,54,772 పురుషులు, 1,42,858 మంది స్త్రీలు, 36 మంది థర్డ్ జెండర్ ఉన్నారు. వీరిలో పురుషులు 52 శాతం ఉండగా, స్త్రీలు 47.99, ఇతరులు 0.01 శాతం ఉన్నట్లు డిప్యూటీ కమిషనర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి ప్రశాంతి తెలిపారు. శనివారం ఎన్నికల అధికారులతో కలిసి ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 6: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐజీహెచ్ఎస్, ఐజీహెచ్ఎస్ ఇండస్ట్రీస్, మధుబన్ కాలనీ, పద్మాశాలిపురం, ఆప్కో కాలనీ, రామ్ రామ్ స్కూల్, శివాజీనగర్, శివాజీనగర్ ఇండస్ట్రీయల్ ఏరియా, జల్‌పల్లి ఇండస్ట్రీయల్, వేంకటేశ్వర కాలనీల్లో మరమ్మతుల వల్ల విద్యుత్ కోత విధిస్తున్నామన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

మాట్లాడుతున్న సీఐ బాలరాజు

శంషాబాద్ రూరల్, జనవరి 6: శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ సీఐ బాలరాజు హెచ్చరించారు. శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కొత్తగా సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ రాత్రి 11గంటల వరకు శంషాబాద్‌లోని అన్ని వ్యాపార కేంద్రాలు మూసివేయాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి

మియాపూర్, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందేలా కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం తగు కృషి చేస్తున్నదన్నారు. మియాపూర్ డివిజన్ మయూరీనగర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం మియాపూర్ డివిజన్ మయూరీనగర్‌లో కాలనీవాసులతో కలిసి జగదీశ్వర్ గౌడ్ పర్యటించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం ప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

వెంగళరావునగర్, జనవరి 6: భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రహ్మత్ నగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...రహ్మత్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సాగర తుకారాం(45)కు 2009లో సాగర సునీతతో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. అయితే ఏడాది క్రితం నుంచి దంపతులు మధ్య మనస్పర్థలు వచ్చాయి.ఈక్రమంలో ఈనెల 2వ తేదీన ఇద్దరు గొడవ పడి మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. నేను విడాకులు తీసుకుని నా దారి నేను చూసుకుంటానని చెప్పిన భార్య పుట్టింటి వెళ్లింది. కలత చెందిన తుకారాం మద్యం తాగి 4వ తేదీన రహ్మత్‌నగర్ చౌరస్తాలో యాసిడ్‌ను తాగాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం తుకారంను గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తుకారాం తల్లి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అభిలాష అభినవ్

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 6 : కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అభిలాష అభినవ్ బాధ్యతలు స్వీకరించారు. కూకట్‌పల్లి జడ్సీగా పనిచేసిన వి.మమత నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా బదిలీ కావడంతో నూతన జోనల్ కమిషనర్‌గా అభిలాష అభినవ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు శనివారం జడ్సీ మమత బదిలీపై వెళ్లిపోగా.. కొత్త జడ్సీగా అభిలాష అభినవ్ బాధ్యతలు స్వీకరించారు.

అలరించిన వేణుగానం

మాదాపూర్, జనవరి 6: మాదాపూర్‌లోని అన్నమాచార్య బావనా వాహినిలో కళాకారుడు రామశర్మ వేణు గానం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామి వారికి నృత్య కైంకర్యం చేశారు. ఇందులో భాగంగా తొలుత అన్నమాచార్య బావనా వాహిని విద్యార్థులు శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రమ్, శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రమ్, శ్రీ అన్నమాచార్య అష్టోత్తర శవ నామావళి, గురుస్తుతితో ప్రారంభించారు. కళాకారులు వాతాపి గణపతిం భజే, ప్రభుం ప్రాణ నాదం, తిరుమల గిరిరాయ, వరణు శరణు, భావము లోన, బాహ్యము నందును వంటి సంకీర్తనలకు వేణుగానం చేశారు. అనంతరం పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు కళాకారుడు రామశర్మకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ

• చివరి రోజు పోటెత్తిన దరఖాస్తులు
• క్యూలైన్‌లో బారులు తీరిన ప్రజలు
• దరఖాస్తులను స్వీకరించిన అధికారులు

ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి,జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన అభయ హస్తం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శనివారం ఐదు గ్యారెంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు చివరి రోజు కావడంతో ప్రజలు ప్రజా పాలన కేంద్రాల వద్ద క్యూ కట్టారు. తమ దరఖాస్తులను అందించేందుకు గంటల తరబడి వేచి ఉండి దరఖాస్తులను అధికారులకు అందజేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో బాబుల్‌రెడ్డినగర్, మార్కండేయనగర్‌లలోని కేంద్రాలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమాల్లో బాబుల్‌రెడ్డినగర్ ఆర్‌పీ హేమలత, జ్యోతి, సంధ్య, స్వర్ణలత, నాగమణి, భాగ్య, పావని, రూపా, గాయత్రి, సోని, సుమాంజలి, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

19వ సర్కిల్‌లో..

జూబ్లీహిల్స్: ప్రజా పాలనలో భాగంగా జీహెచ్ఎంసీ పరిధి 19వ సర్కిల్‌లో యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో సిబ్బంది దరఖాస్తులు స్వీకరించారు. డిప్యూటీ కమిషనర్ సేవా ఎస్లావత్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పకడ్బందీగా కార్యక్రమ నిర్వహణ చేపట్టారు. 19వ సర్కిల్‌లో మొత్తం 87,194 దరఖాస్తులు వచ్చాయి.

మణికొండ కమ్యూనిటీహాల్‌లో..

మణికొండ: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శనివారం 19వ వార్డులోని మణికొండ కమ్యూనిటీ హాల్‌లోని సెంటర్‌ను మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల సందేహాలను నివృత్తి చేసి వారు జత చేయాల్సిన పత్రాలను తెలియజేశారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరికి లబ్ధి చేకూరేందుకే ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కమిషనర్ ఫల్గుణ్‌కుమార్, కౌన్సిలర్లు వసంతచౌహాన్, లక్ష్మీనారాయణ, తేజ, శ్రీరాములు పాల్గొన్నారు.

శంషాబాద్ మండలంలో..

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో శనివారం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో వసంతలక్ష్మీ తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీలో 25 వార్డుల్లో దరఖాస్తులు స్వీకరించినట్లు కమిషనర్ భోగేశ్వర్లు విలేకరులకు తెలిపారు.

'ఓయో'లో వ్యభిచారం..ముగ్గురి అరెస్టు

వెంగళరావునగర్, జనవరి 6: గుట్టుచప్పుడు కాకుండా యాప్ ద్వారా ఓయో హోటల్‌లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న కేంద్రంపై ఎస్ఆర్ నగర్ పోలీసులు దాడి చేశారు. నిర్వాహకులు పరారుకాగా ఇద్దరు విటులు, ఓ యువతిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పీవీ రామ్‌ప్రసాదరావు కథనం ప్రకారం... అమీర్‌పేటలోని వీవీజీ గ్రాండ్ ఓయో హోటల్‌లోని ఓ గదిలో వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. నగరానికి చెందిన ప్రసాద్‌రెడ్డి అలియాస్ చేతన్ అలియాస్ మంజునాథ్‌తో పాటు ఓ మహిళ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. లోకాంటో యాప్ ద్వారా విటులను ఆకర్షిస్తూ ఓయో హోటల్‌లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. పోలీసుల దాడితో నిర్వాహకులైన ప్రసాద్‌రెడ్డి, సదరు మహిళ పరారు కాగా విటులుగా వచ్చిన నల్గొండకు చెందిన రామగిరి సందీప్, సముద్రాల శంకరయ్యతో పాటు పశ్చిమబెంగాల్‌కు చెందిన యువతిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పారిశ్రామిక రంగం వైపు ఆలోచనలు చేయాలి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

కుత్బుల్లాపూర్,జనవరి6: విద్యార్థులు పారిశ్రామిక రంగం వైపు ఆలోచన చేసి సమాజంలో ఉపాధి అవకాశాలను కల్పించే స్థాయికి ఎదగాలని దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల దూలపల్లిలో జరిగిన యువత భావి పారిశ్రామికవేత్తలు అనే అంశంపై ఒక్కరోజు అవగాహన సదస్సులో ఎంఎస్ఎంఈ, కేవీఐసీ, డీఐసీ, ఎస్‌బీఐలకు చెందిన పలువురు వక్తలు హాజరై తమ సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.సంతోష్‌కుమార్‌పాత్ర, వక్తలు ఆర్‌కె యాదవ్, సుధీర్‌వర్మ, శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ జి.చంద్రశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.